సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 27 సెప్టెంబర్ 2023



ఆకట్టుకునే అందాలు..
ప్రకృతి అందాల కలబోత.. గోదావరి తీరానికి అలవాలమైన సుందర ప్రదేశాలు పర్యాటకులను అకట్టుకుంటున్నాయి. 8లో



భగ్గుమన్న విభేదాలు
ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశంలో విభేదాలు భగ్గుమన్నాయి. దీంతో పార్టీ పరిశీలకుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 32° / 24°
జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అంజనేయస్వామి వారికి అభిషేకం , ప్రత్యేక పూజలు చేశారు.


మూడు రోజులు వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో మూడు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ విభాగం అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.

నేడు 'నిధి ఆప్ కే నిఖత్'

ఖమ్మంసహకారనగర్: ఈపీఎఫ్ చందాదారులు, పెన్షనర్లు, యజమాన్యాల సమస్యలు పరిష్కరించేందుకు బుధవారం 'నిధి ఆప్ కే నిఖత్' నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఖమ్మం జిల్లా వారి కోసం నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని మధుకాన్ షుగర్స్ లిమిటెడ్‌లో, భద్రాద్రి జిల్లా వాసులకు అశ్వాపురంలోని గౌతమినగర్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈమేరకు ఉద్యోగులు, యజమానులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

కిన్నెరసాని గేట్ ఎత్తివేత



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 500 క్యూసెక్కుల నీరు రావడంతో మంగళవారం నీటిమట్టం 406 అడుగులకు పెరిగింది. దీంతో ఒక గేట్ ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ సురేష్ తెలిపారు. వరద ఉధృతిని బట్టి గేట్లు ఎత్తుతామని, దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

డబుల్ వేగంగా..

స్పీడందుకుంటున్న డోర్నకల్ - భద్రాచలంరోడ్ డబ్లింగ్ పనులు

- ప్రత్యేక ప్రాజెక్టుగా చేపడుతున్న రైల్వేశాఖ
- భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ
- త్వరలో పట్టాలెక్కనున్న నిర్మాణ పనులు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బొగ్గు రవాణాలో కీలకంగా ఉన్న భద్రాచలంరోడ్ – డోర్నకల్ రైల్వే మార్గంలో రెండో ట్రాక్ (డబ్లింగ్) నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. ఇందుకు అవసరమైన భూమిని సేకరించేందుకు రైల్వేశాఖ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

మూడు జిల్లాల్లో..

ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాల మీదుగా వెళ్లే డోర్నకల్ – భద్రాచలంరోడ్ రైల్వేలైన్ డబ్లింగ్ ప్రాజెక్ట్‌ను ప్రత్యేకమైనదిగా రైల్వేశాఖ గుర్తించింది. ఈ మేరకు 52.5 కిలోమీటర్లు ప్రస్తుతం ఉన్న ట్రాక్‌కు సమాంతరంగా కొత్త ట్రాక్ నిర్మిస్తారు. దీని కోసం ఇప్పటికే రైల్వేశాఖ రూ.733 కోట్లు కేటాయించింది. అయితే డోర్నకల్ నుంచి భద్రాచలం రోడ్ వరకు ఉన్న ట్రాక్ వెంట సగానికి పైగా ప్రాంతాల్లో రైల్వేకు సరిపడా స్థలం అందుబాటులో ఉంది అక్కడక్కడా భూసేకరణ చేయాల్సి ఉంది. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం పట్టణ పరిధిలో న్యూగొల్లగూడెంలోని రాజీవ్ గృహకల్ప నుంచి మొదలుకుని బేతంపూడి స్టేషన్ వరకు స్థల సేకరణ చేయాల్సి వస్తోంది. అలాగే ఖమ్మం జిల్లాలోని కారేపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ మండలాల్లోనూ స్థల సేకరణ అవసరం అవుతోంది. దీంతో మూడు జిల్లాలకు సంబంధించి భూ సేకరణ కోసం రైల్వేశాఖ మంగళవారం ఉమ్మడి నోటిఫికేషన్ జారీ చేసింది.

ఆరు నెలల్లో మొదలు..

రెండో రైలు మార్గం నిర్మాణం కోసం ప్రస్తుతం ఉన్న ట్రాక్ నుంచి 15 మీటర్ల వరకు స్థలాన్ని సేకరిస్తారు. అక్కడి నుంచి మరో 50 మీటర్ల వరకు స్థలాన్ని బఫర్ జోన్‌గా ప్రకటిస్తారు. ఈ ప్రాంతంలో వ్యవసాయేతర పనులు, శాశ్వత కట్టడాలు, భారీ భవనాల నిర్మాణంపై నిషేధం అమల్లోకి వస్తుంది. తాజాగా దక్షిణ మధ్య రైల్వే జారీ చేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి మూడు జిల్లాలకు చెందిన రెవెన్యూ విభాగం అధికారులు ఆయా మండలాల పరిధిలో త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. స్థల సేకరణ పూర్తయిన తర్వాత టెండర్లు, అనంతరం నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. మొత్తంగా మరో ఆరు నెలల్లో డబ్లింగ్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

రోజుకు 103 రైళ్లు..

డోర్నకల్ జంక్షన్ నుంచి భద్రాచలం రోడ్ వరకు ప్రస్తుతం సింగిల్ లైన్ అందుబాటులో ఉంది. ఈ మార్గం గుండానే ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం, సత్తుపల్లిలో ఉత్పత్తి అయిన బొగ్గును దేశంలోని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. అంతేకాకుండా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు డోలమైట్ రవాణాకూ ఈ మార్గమే కీలకం. ప్రస్తుతం ఈ మార్గంలో నిత్యం అప్, డౌన్ కలిపి 103 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దేశంలో థర్మల్ విద్యుత్‌కు విపరీతమైన డిమాండ్ ఉండటంతో భద్రాచలం రోడ్ నుంచి డోర్నకల్ వరకు బొగ్గు రవాణా చేసే గూడ్స్ రైళ్ల రాకపోకలు కీలకంగా మారాయి. దీంతో తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. అధికారులు గూడ్స్ బండ్ల క్లియరెన్స్‌కు ప్రాముఖ్యత ఇస్తూ ప్యాసింజర్ రైళ్లను తరచుగా ఆపేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డబ్లింగ్ పనులు పూర్తయితే..

డబ్లింగ్ పనులు పూర్తయితే కనీసం కొత్తగూడెం – డోర్నకల్ మధ్య ప్రస్తుతం ఉన్న రైళ్లు ఆలస్యం కాకుండా నడిచేందుకు వీలవుతుంది. అలాగే తిరుపతి, షిరిడీ, నిజామాబాద్, మంచిర్యాల, గుంటూరు తదితర ప్రాంతాలకు మరిన్ని రైళ్లు నడిపించేందుకు వీలవుతుంది. ఇక ఇటీవల ఫైనల్ లొకేషన్ సర్వేకు అనుమతి లభించిన మణుగూరు – రామగుండం, కొత్తగూడెం – కిరండోల్, భద్రాచలం – మల్కన్‌గిరి మార్గాల నిర్మాణ పనులు కూడా ప్రారంభమైతే కొత్తగూడెం రైల్వే పరంగా కాజీపేటను మించిపోయే అవకాశం ఉంది. కరోనాకు ముందు భద్రాచలం రోడ్ – డోర్నకల్ మధ్య ఏడు రైళ్లు నడిచేవి. ప్రస్తుతం ఐదు మాత్రమే ఉన్నాయి. గతంలో కొత్తగూడెం మీదుగా నడిచిన మణుగూరు, సింగరేణి, బెళగావి, డోర్నకల్, విజయవాడ రైళ్లను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- భద్రాద్రిలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- రెండు రోజుల పాటు నిమజ్జనాలు
- 3 వేల విగ్రహాలు వస్తాయని అధికారుల అంచనా



విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన లాంచీ



నిమజ్జన ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు

భద్రాచలంటౌన్: భద్రాద్రి పుణ్యక్షేత్రంలోని పవిత్ర గౌతమి నదీతీరంలో వినాయక నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవరాత్రుల పాటు మండపాలలో భక్తుల పూజలందుకున్న గణపతుల నిమజ్జనం బుధ, గురువారాల్లో నిర్వహించనున్నారు. భద్రాచలం గోదావరి నదికి వివిధ ప్రాంతాల నుంచి సుమారు మూడు వేల విగ్రహాలు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాద్రి పరిసర ప్రాంతాల నుంచి శోభాయాత్రగా భద్రాద్రికి చేరిన విగ్రహాలను అంబేడ్కర్ సెంటర్ మీదుగా కూనవరం రోడ్డు నుంచి కరకట్ట ద్వారా గోదావరి నది వద్దకు చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు. నిమజ్జనం అనంతరం వాహనాలను కరకట్టపై నుంచి నేరుగా రహదారిపైకి మళ్లిస్తారు. భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు రెండు క్రేన్లు, విగ్రహాలను గోదావరి మధ్యలో వదిలేందుకు మూడు లాంచీలను సిద్ధంగా ఉంచారు. 300 మంది సహాయక సిబ్బంది, 15 మంది గజ ఈతగాళ్లను నియమించారు. రాత్రి సమయంలో కూడా నిమజ్జనాలకు ఆటంకం కలుగకుండా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి వెళ్లే ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పంచాయతీ అధికారులు రహదారికి ఇరువైపులా శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. నిమజ్జనానకి వచ్చే భక్తుల కోసం వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

మూడు చోట్ల పార్కింగ్ స్థలాలు..

భద్రాచలం గోదావరి నదిలో గణపతుల నిమజ్జనానికి వచ్చే భక్తుల వాహనాలు నిలిపేందుకు మూడు చోట్ల స్థలాలను గుర్తించారు. రామాలయం సమీపంలో, ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద, జూనియర్ కళాశాల గ్రౌండ్‌ను పార్కింగ్‌కు కేటాయించారు. నిమజ్జనానికి విగ్రహం తీసుకొచ్చిన వారు పోలీసులు ఏర్పాటు చేసి ఔట్‌పోస్టు వద్ద వివరాలు నమోదు చేసుకొని టోకెన్ తీసుకోవాలని పోలీసులు సూచించారు. శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కరకట్టపైకి వాహనంతో వస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఒక్కో విగ్రహ నిమజ్జనాన్ని 10 నిమిషాల్లోపే పూర్తి చేయాలని సూచించారు.

నేడు వైన్‌షాపులు బంద్

గణేష్ నిమజ్జనాల సందర్భంగా భద్రాద్రి ప్రాంతంలో బుధవారం వైన్‌షాపులు మూసి వేయాలని ఎక్సైజ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నిమజ్జన సమసయంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

హాస్టళ్ల నిర్వహణను పటిష్టం చేయాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



పాల్వంచ ఆశ్రమ పాఠశాలలో పరిశీలిస్తున్న పీఓ

పాల్వంచ : గిరిజన సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణను పటిష్టం చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. స్థానిక ఆశ్రమ గిరిజన బాలుర పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు బయట కూర్చుని భోజనం చేస్తుండటంతో హెచ్‌ఎం, వార్డెన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, డార్మెటరీని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు అనేక వసతులు కల్పిస్తున్నామని, సిబ్బంది నిర్లక్ష్యంతో పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. పుస్తకాలు, నోట్ బుక్స్, సాధన బుక్స్ పిల్లలకు పంపిణీ చేయకుండా స్టోర్ రూంలో పడేయడం ఏంటని ప్రశ్నించారు. డీడీ మణెమ్మకు ఫోన్ చేసి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని, డిప్యూటీ వార్డెన్ ప్రమోద్‌ను మార్చు చేయాలని ఆదేశించారు. ఇలాంటి పరిణామాలు పునారావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

344 మందికి ట్రైకార్ రుణాలు

జూలూరుపాడు: జిల్లాలో ఇప్పటివరకు 344 మందికి ట్రైకార్ రుణాలు మంజూరు చేసినట్లు పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. జూలూరుపాడు ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ట్రైకార్ సబ్సిడీ రుణాల ప్రత్యేక డ్రైవ్‌లో యూనిట్లు సత్వరమే గ్రౌండింగ్ చేయాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు త్వరగా బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా క్యాంపులు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఐదు మండలాల్లో పూర్తయ్యాయని తెలిపారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సెర్ప్ ఏపీఎం సత్యనారాయణరాజు, ఎంపీఓ తులసీరాం, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా పారదర్శకంగా రూపొందించాలి



మాట్లాడుతున్న బాల మాయాదేవి, పక్కన పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు

రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పారదర్శక ఓటరు జాబితా రూపొందించాలని రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, స్వీప్ నోడల్ అధికారి, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 18 – 19 ఏళ్ల మధ్య వయసు వారు 21,194 మంది నూతన ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. నూతన ఓటర్ల ప్రక్రియకు కలెక్టర్ ప్రియాంక ఆల చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికంగా నమోదు, తొలగింపు చేసిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖుల ఓట్లు జాబితాలో ఉన్నాయో లేదో మరోసారి పరిశీలించాలని అన్నారు. ప్రతీ ఓటర్‌కు గుర్తింపు కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు 21న ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో 9,28,983 మంది ఓటర్లు ఉన్నారని, ఫారం 6,7,8 లకు 68,703 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటివరకు 50,659 దరఖాస్తుల విచారణ పూర్తయిందని వివరించారు. మిగిలిన దరఖాస్తులను ఈనెల 29 నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఐదు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రతీక్‌జైన్, రాంబాబు, శిరీష, కాశయ్య, మంగీలాల్, స్వీప్ నోడల్ అధికారి మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ప్రసాద్, రంగప్రసాద్ పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న బాల మాయాదేవి..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షకులు బాల మాయదేవి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

4లోగా 'ఉన్నతి' పూర్తి చేయాలి



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న నాగరాజశేఖర్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, లోకల్‌బాడీ, కేజీబీవీ పాఠశాలల్లో ఆరు నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఉన్నతి ప్రారంభ పరీక్షను అక్టోబర్ 4 లోగా పూర్తి చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి నిర్ణీత ఫార్మాట్‌లో నమోదు చేయాలన్నారు. కొత్తగూడెంలోని బాబు క్యాంప్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన పరిశీలించి పరీక్ష నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈనెలలో అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు 'ఉన్నతి' శిక్షణ అందించామని, జిల్లాలోని తొమ్మిది కేంద్రాల్లో నాలుగు విడతలుగా శిక్షణ పూర్తి చేశామని చెప్పారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన, అభ్యసన ప్రక్రియ చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. నీరజ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యం, వీరత్వానికి ప్రతీక ఐలమ్మ

ఎస్పీ డాక్టర్ వినీత్



ఐలమ్మ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: మహిళల్లో చైతన్యానికి, వీరత్వానికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఐలమ్మ 128వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట యోధురాలు ఐలమ్మ అన్ని వర్గాల మహిళలకు ఆదర్శమని అన్నారు. పేదల తరఫున పెత్తందారులతో పోరాడి ధైర్యంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ విజయ్‌బాబు, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏఓ జయరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రాజువర్మ, ఆర్‌ఐలు రవి, సుధాకర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత..

గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామని ఎస్పీ వినీత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం గోదావరి నదికి విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని వివరించారు. కొత్తగూడెం, పాల్వంచ మీదుగా భద్రాచలం వెళ్లే వాహనాలకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

ఓటు వజ్రాయుధం వంటిది

అదనపు కలెక్టర్ రాంబాబు



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోలింగ్ ప్రక్రియలో ప్రతీ ఓటు చాలా విలువైనదని అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఓటుహక్కు వినియోగంపై మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఓటున్న వారంతా బాధ్యతగా ఓటు వేయాలని చెప్పారు. జిల్లాలో 93 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని, వారిలో 54 మందికి ఓటు హక్కు ఉందని, ఇంకా 39 మంది నమోదు చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నూరు శాతం పోలింగ్ ప్రక్రియ సాగాలనే లక్ష్యంతో విస్తృతంగా స్వీప్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. జిల్లాలోని 1095 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈవీఎంల ద్వారా ఓటుహక్కుపై నమూనా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఓటరు హెల్ప్‌లైన్, ఎన్‌ఈఎస్‌పీల ద్వారా ఓటు హక్కు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ల అభీష్టం మేరకు ఫారం 8 ద్వారా ప్రత్యేక కేటగిరీలో నమోదు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, స్వీప్ నోడల్ అధికారి త్రినాథ్‌బాబు, పీడబ్ల్యూడీ నోడల్ అధికారి లెనీనా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ప్రసాద్, సెక్యూర్ ఎన్‌జీఓ రాజేంద్రప్రసాద్, ట్రాన్స్‌జెండర్ల జిల్లా ప్రెసిడెంట్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



'సాక్షి' ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ స్వామి

- దోమల విజృంభణతో డెంగీ బారిన పడుతున్నాం
- డ్రైయినేజీ లేక ఇబ్బందులు వస్తున్నాయి
- భగీరథ పైపులు లీకై.. రోడ్లు దెబ్బతింటున్నాయ్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో కమిషనర్‌కు పట్టణ ప్రజల ఫిర్యాదులు

సాక్షి ఫోన్ ఇన్

పాల్వంచ : పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా లేక దోమలు విజృంభిస్తున్నాయని, తద్వారా డెంగీ, మలేరియా వంటి జ్వరాల బారిన పడుతున్నామని పట్టణ వాసులు మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి పైపులైన్ల లీకేజీతో మురుగు చేరి కలుషితం అవుతున్నాయని, ఆ నీరు తాగడంతో అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టం చేయాలని, మురుగు నీరు రోడ్లపైకి రాకుండా చూడాలని కోరారు. 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తేగా, పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని స్వామి హామీ ఇచ్చారు.

- **ప్రశ్న :** పైపులైన్ల లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. కాలనీలో దోమలు విపరీతంగా ఉన్నాయి. ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగి అధ్వానంగా మారాయి
  – టి.లక్ష్మీనారాయణ, గట్టాయిగూడెం, యాకూబ్‌పాషా, అయ్యప్ప నగర్

జవాబు : పైపులైన్ల లీకేజీ సమస్యపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. గట్టాయిగూడెం, అయ్యప్పనగర్‌లో లీకేజీలు అరికడతాం. శాశ్వత పరిష్కార మార్గం చూస్తాం. ఓపెన్ ప్లాట్లలో చెత్తపై యజమానులకు నోటీసులు ఇస్తాం. సెంట్రల్ లైటింగ్ గురించి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడుతాం.

- **ప్ర :** డ్రెయినేజీలు దెబ్బతిన్నాయి. మురుగు నీటి నిల్వతో దోమలు వ్యాప్తి చెంది టైఫాయిడ్, డెంగీ జ్వరాలు వస్తున్నాయి. ఏడాది కాలంగా దోమల మందు స్ప్రే చేయలేదు. వీధి లైట్లు వెలగడం లేదు.
  – డి.సౌమ్య, గాంధీనగర్, శ్రీనివాస్‌రెడ్డి, రాము, మహేందర్ – శివనగర్

జ : త్వరలో ప్రత్యేక నిధులు రాగానే కొత్త డ్రెయినేజీలు నిర్మిస్తాం. పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. దమ్మపేట సెంటర్‌లో పైనుండి వరద నీరు పోయేలా పెద్ద డ్రెయిన్లు ఏర్పాటు చేశాం. ఇంకా కూడా ప్రతిపాదనలు చేస్తాం. వీధి లైట్ల సమస్య పరిష్కరిస్తాం.

- **ప్ర :** భగీరథ పైపులైన్ వేసినా మూడేళ్లుగా పంపు కనెక్షన్ లేదు. ఈ సమస్య పరిష్కరించండి
  – షేక్ అఫ్జల్, గోవర్ధన గిరి కాలనీ

జ : మిషన్ భగీరథ పైపులైన్ల పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. త్వరలోనే ఇంటింటికీ కనెక్షన్లు ఇస్తాం.

- **ప్ర :** పైప్‌లైన్ల కోసం రోడ్లు ధ్వంసం చేశారు. దీంతో ఇబ్బంది పడుతున్నాం
  – జార్జ్, బాపూజీనగర్

జ : పైపులైన్ల కోసం తవ్విన రోడ్లకు తప్పక మరమ్మతులు చేయిస్తాం. మీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు కూడా ప్రతిపాదనలు చేశాం.

- **ప్ర :** గొల్లగూడెం ఏరియాలో 14 అడుగుల రోడ్డులో కాల్వ ఒక వైపే ఉంది. రెండో వైపు కూడా నిర్మించాలి
  – అర్జున్, గొల్లగూడెం, గణపతి నగర్

జ : మీ ఏరియాను త్వరలో పరిశీలిస్తా. డ్రెయిన్ మంజూరై ఉంటే వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తా.

- **ప్ర :** టీచర్స్ కాలనీలో ఉన్న అతిపెద్ద డ్రెయినేజీ లింకు సరిగా లేదు. ఇళ్ల మధ్యలో డ్రెయిన్ల నుంచి సరిగా మురుగు తొలగించడం లేదు.
  – కిరణ్ కుమార్, టీచర్స్ కాలనీ

జ : ఆ ఏరియాలో డ్రెయినేజీల్లో మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. జవాన్లను పంపించి పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేస్తాం. త్వరలో వచ్చే నిధులతో కొత్త డ్రెయినేజీలు నిర్మించి సమస్య పరిష్కరిస్తాం.

- **ప్ర :** పాత్వ పాల్వంచలో వీధి కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం. సమస్య పరిష్కరించండి
  – కృష్ణ, పాత పాల్వంచ

జ : వీధి కుక్కలను రోజుకు పది చొప్పున పట్టి స్టెరిలైజేషన్‌కు పంపిస్తున్నాం. దీంతో గతంలో కంటే చాలా మార్పు వచ్చింది. వీధి కుక్కలు మనుషుల వెంట పడటం లేదు. ఇంకా వెయ్యి కుక్కలు పట్టేలా అనుమతి తీసుకున్నాం. ఇది నిరంతర ప్రక్రియ.

- **ప్ర:** సీతారాంపట్నం, మారుతీనగర్‌లో వీధిలైట్లు వెలగడం లేదు. చర్యలు చేపట్టండి
  – వెంకట్ గౌడ్, సీతారాంపట్నం

జ : లైన్ కనెక్షన్ సరిచూస్తాం. వీధిలైట్లు వెలిగేలా ఏఈతో మాట్లాడుతా.

- **ప్ర :** వీపరీతమైన దోమలతో ఇబ్బంది పడుతున్నాం. చెత్త ట్రాక్టర్లు సక్రమంగా రాక ఇళ్లలోనే ఉంచడంతో దుర్వాసన వస్తోంది. అనారోగ్య సమస్యలు వాటిల్లే పరిస్థితి నెలకొంది.
  – లక్ష్మణ్, శ్రీనివాస్, అయ్యప్పనగర్

జ : చెత్త ట్రాక్టర్లు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకుంటాం. దోమల మందు కూడా కొట్టిస్తాం. డ్రెయినేజీ నిర్మాణంతో పాటు, మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

నేడు ఎంపీలు రవిచంద్ర, కవిత రాక

టేకులపల్లి: ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ బుధవారం మండలంలో పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డులో జనరల్‌బాడీ సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి మండలంలోని కొత్తతండా, ప్రెగళ్లపాడు, చంద్రుతండా, బొమ్మనపల్లి, రామకృష్ణాపురం, బిల్లుతండా, చింతల్లంక, సులానగర్ గ్రామా ల్లో పర్యటిస్తారని, అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బానోత్ రామ, దళపతి శ్రీనివాసరాజు, జాల మురళి, అర్జున్‌రావు, కిరణ్, వాలు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల వాహనం అడ్డగింత


కార్గో వాహనం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీ టీచర్లు

దమ్మపేట: అంగన్వాడీ కేంద్రాలకు ఆహార పదార్థాలను సరఫరా చేసే ఆర్‌టీసీ కార్గో వాహనాన్ని సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ టీచర్లు మంగళవారం అడ్డగించారు. ఈ సందర్భంగా వారు కార్గో వాహనం గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సరుకుల సరఫరా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు బెజవాడ రాము, అంగన్వాడీలు శాంతకుమారి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంది

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. ఈ నెల 30న భద్రాచలం పట్టణంలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్న నేపథ్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. భద్రాచలం శివారులో ఏపీ సరిహద్దు వరకు సుమారు రూ.39 కోట్ల వ్యయంతో మిగిలిన 400 మీటర్ల కరకట్ట నిర్మాణ పనులతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఒకే రోజు జిల్లాలో పర్యటన ఉండడంతో ఎలాంటి బహిరంగ సభను ఏర్పాటు చేయలేదని తెలిపారు. సమావేశంలో అరికెళ్ల తిరుపతిరావు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యతో విద్యార్థి మృతి


ప్రవీణ్ (ఫైల్)

టేకులపల్లి: ఊపిరితిత్తుల సమస్యతో విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రాంపురం పంచాయతీ పాతతండాకు చెందిన బర్మావత్ సర్వన్, జాంకీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు బర్మావత్ ప్రవీణ్ (30) ఉన్నారు. డిగ్రీ పూర్తి చేసిన ప్రవీణ్ తల్లిదండ్రులకు సాయం చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈ నెల 21న ప్రవీణ్‌కు అకస్మాత్తుగా జ్వరం రావడం, ఊపిరిఆడకపోవడంతో కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో 23న హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించారు. ఊపిరితిత్తుల్లో నీరు చేరడం, లివర్ ఫెయిల్యూర్ కారణంగా కార్డియాక్ అరెస్టుతో ప్రవీణ్ మంగళవారం మృతి చెందాడు.

ఇద్దరిపై కేసు నమోదు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిపై ఎస్‌ఐ గణేశ్ మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రకేసరినగర్ కాలనీలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదంపై చేపట్టిన విచారణలో భాగంగా ఓ వర్గానికి చెందిన సమ్మక్క, మద్ది సందీప్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఇలాంటి చర్యలు నేరమని, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై...

భద్రాచలంఅర్బన్: సమాజంలో గుర్తింపు కలిగిన వ్యక్తులకు ఫోన్ చేసి పిలిపించి.. అఘాయిత్యం చేసినట్లుగా బెదిరింపులకు పాల్పడుతున్న మహిళపై కేసు నమోదైంది. భద్రాచలంలో నివాసముండే ఓ మహిళ పలువురికి ఫోన్ చేసి ఇంటికి పిలిపిస్తోంది. ఆతర్వాత తనపై అఘాయిత్యం చేశారని చెబుతూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించి డబ్బు వసూలు చేస్తోంది. ఈమేరకు ఓ వ్యక్తి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుతో ఆమెపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు. కాగా, ఆమె గతంలో కొందరిపై ఫిర్యాదు చేసిందని.. బాధితులెవరైనా ఉంటే సమాచారం ఇవ్వాలని సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

ఆకట్టుకునే అందాలు..

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక శోభ
- ఇంకొన్ని వసతులు కల్పిస్తే పర్యాటకులకు స్వర్గధామమే..

నేడు అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం


కిన్నెరసాని జలాశయంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: ఉమ్మడి జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ప్రకృతి అందాల కలబోత గోదావరి తీరానికి అలవాలమైన సుందర ప్రదేశాలు పర్యాటకులను అకట్టుకుంటున్నాయి. ఉమ్మడి కొండకోనలతో చూడచక్కని ప్రకృతి.. అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రకమైన కట్టడాలు కనిపిస్తాయి. పర్యాటకులకు కనువిందు చేసే సహజసిద్ధమైన అందాలెన్నో ఉన్నాయి. నేడు (బుధవారం) ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక కథనం.

కిన్నెరసాని వచ్చిందమ్మా..

పచ్చని పొదరిల్లుగా పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచే ఎత్తయిన కొండలు, గుట్టలు, కిన్నెరసాని జలాశయం మధ్య చూడచక్కని హైలాండ్స్ పర్యాటకులను ఆకట్టుకుంటాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి 24 కి.మీ. దూరాన పాల్వంచ మండలంలో కిన్నెరసాని ఉంది. ఇక్కడ జలాశయం, రెండు ఐలాండ్‌లు, బోటుషికారు, చుక్కల దుప్పులు కలిగిన డీర్ పార్కు, అద్దాలమేడ, కాటేజీలు ఆకట్టుకుంటాయి. కిన్నెరసానిని మరింత అభివృద్ధి చేసేలా కేంద్ర ప్రభుత్వం 2015లో నీతి ఆయోగ్ పథకం ద్వారా రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. ఈ నిధులతో కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద హరిత హోటల్, కిన్నెరసానిలో పది కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు నిర్మాణ దశలో ఉన్నాయి. కిన్నెరసాని రిజర్వాయర్‌లో పర్యాటకుల సౌకర్యార్థం బోటుషికారు ఏర్పాటు చేశారు. ఇక కొత్తగూడెంనకు ఆరు కి.మీ. దూరాన ఎత్తయిన గుట్టపై నవభారత్ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆకట్టుకుంటోంది. అలాగే, భద్రాచలం వైపు వెళ్లే మార్గంలో పాల్వంచకు నాలుగు కి.మీ. దూరంలో జగన్నాథపురం వద్ద పెద్దమ్మతల్లి ఆలయం భక్తుల కొంగుబంగారంలా విరాజిల్లుతోంది.

గోదావరి తీరాన రామచంద్రుడు

జిల్లా కేంద్రానికి 45 కిలోమీటర్ల దూరంలో భద్రాచలంలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయం ఉంది. భారతదేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో ఒక్కటిగా భాసిల్లుతోంది. గోదావరి తీరం వెంట రామాయణం కాలంనాటి ఘట్టాల బాపు బొమ్మలు, వాటి ఆనవాళ్లు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. అలాగే, భద్రాచలానికి 36 కిలోమీటర్ల దూరంలో గోదావరి ఒడ్డున ఉన్న పర్ణశాల ప్రకృతి రమణీయ దృశ్యాలతో విరాజిల్లుతోంది. అలాగే, అన్నపురెడ్డిపల్లిలో కాకతీయులు నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం కూడా భక్తులను ఆకర్షిస్తోంది. ఇక ఖమ్మం జిల్లా జమలాపురంలో చిన్న తిరుపతిగా పేరుగాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయం నిత్యపూజలతో కళకళలాడుతోంది. కూసుమంచిలో కాకతీయులు నిర్మించిన శివాలయం కూడా ఉంది.

చారిత్రక బౌద్ధ స్తూపాలు

ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో వంద ఎకరాల విస్తీర్ణంలో మట్టితో నిర్మించిన చారిత్రక కట్టడాలు, ముజ్జుగూడెంలో బౌద్ధులు నిర్మించిన స్తూపాలు కనిపిస్తాయి. అలాగే, పాలేరు రిజర్వాయర్, ఖమ్మంలో చారిత్రక ఖిల్లా, లకారం ట్యాంక్ బండ్, సస్పెన్షన్ బ్రిడ్జి, వైరా రిజర్వాయర్ కూడా పర్యాటకులను రా.. రమ్మని పిలుస్తుంటాయి.

పర్యాటరంగ అభివృద్ధికి కృషి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే రూ.18.77 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయితే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. కిన్నెరసానిలో అద్దాలమేడ, కాటేజీలు, కొత్తగూడెంలో హరిత హోటల్ పనులు తుది దశకు చేరాయి.

– మనోహర్‌రావు, ఎండీ, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్

డీసీసీబీ మేనేజర్‌పై సస్పెన్షన్ వేటు

- 'ముద్ర' లబ్ధిదారుల ఎంపికలో వెలుగుచూసిన అక్రమాలు
- ముందే చెప్పిన 'సాక్షి'
- ఏడాది కాలంగా విచారణ


ములకలపల్లి డీసీసీబీ కార్యాలయం

ములకలపల్లి : ములకలపల్లి డీసీసీ బ్యాంక్ మేనేజర్ కిషోర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా అధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ బి.రవికి తాత్కాలిక మేనేజర్‌గా బాధ్యతలు అప్పగించారు. డీసీసీబీ ములకలపల్లి శాఖ ద్వారా ఏడాది క్రితం రూ.50 లక్షల ముద్ర రుణాలు మంజూరు చేశారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ ఇద్దరు సొసైటీ డైరెక్టర్లు జిల్లా అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో 'డీసీసీబీలో అవినీతి ముద్ర' శీర్షికన గతేడాది సెప్టెంబర్ 21న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు డీజీఎం ఆర్.ఉపేందర్‌రావు, ఏజీఎం అజయ్‌రెడ్డిని విచారణ అధికారులుగా నియమించి, ఏడాది పాటు సమగ్ర విచారణ నిర్వహించారు. రుణాల పంపిణీలో అక్రమాలు బయటపడడంతో చర్యలకు ఉపక్రమించారు.

'రెవెన్యూ' వివాదంలోనూ ..

ములకలపల్లి తహసీల్దార్ డిజిటల్ కీ అక్రమంగా వినియోగించి, ఈ బ్యాంక్ ఉద్యోగి భార్య ఎస్టీ సర్టిఫికెట్ పొందారు. ఆ యువతి పెట్రోల్ బంక్ ఏర్పాటు నిమిత్తం భూమి కొనుగోలుకు దరఖాస్తు చేయగా, ఆర్‌ఐ విచారణ చేపట్టారు. దరఖాస్తు తిరస్కరించడంతో మేనేజర్ కిషోర్, బ్యాంక్ ఉద్యోగి తహసీల్దార్ కార్యాలయంలో గత నెల 24న వాదనకు దిగారు. ఈ ఉదంతంపై కూడా సాక్షిలో 'డిజిటల్ కీ దుర్వినియోగం' 'లోగుట్టు బయటపడేనా' శీర్షికలతో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ముద్ర రుణాల్లో నెలకొన్న అక్రమాలు, రెవెన్యూ వివాదం తదితర అంశాల నేపథ్యంలో కిషోర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై డీసీసీబీ సీఈఓ అట్లూరి వీరబాబును వివరణ కోరగా ముద్ర రుణాల పంపిణీలో ఫిర్యాదులు వచ్చాయని, విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు వెల్లడైందని తెలిపారు. ఇటీవల భూ వివాదంలోనూ మేనేజర్ జోక్యం చేసుకోవడం తమ దృష్టికి వచ్చిందని, దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెన్షన్ వేటు వేశామని చెప్పారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల కోసం సమష్టి పోరాటం


సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వం, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే వరకు సమష్టి ఉద్యమాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో సీపీఐ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. వామపక్ష పార్టీలు, జర్నలిస్టు, ప్రజా, సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతీ వేదికపై జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు అన్నవరపు సత్యనారాయణ, ఆవునూరి మధు మాట్లాడుతూ కొత్తగూడెంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా మంజూరులో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, లిక్కి బాలరాజు, నూనావత్ గోవిందు, ఎస్.కే.ఫహీమ్, రత్నకుమారి, గోనె మణి, బోయిన విజయ్‌కుమార్, మాచర్ల శ్రీనివాస్, పి.సత్యనారాయణచారి, సురేష్, షమీమ్, విజయలక్ష్మి, ఈమంది ఉదయ్‌కుమార్, జి.వెంకటేశ్వర్లు సూరి, శివకుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- పార్టీ మారిన వారికి టికెట్ ఇవ్వొద్దన్న ఆశావహులు
- ప్రసంగం అనువాదంలో తప్పిదంపై కోరం వర్గీయుల ఆగ్రహం
- రసాభాసగా మారిన నియోజకవర్గ సమావేశం


మాట్లాడుతున్న పరమేశ్‌నాయక్, పక్కన పొదెం వీరయ్య, కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కాంగ్రెస్‌లోని వర్గ విభేదాలు నియోజకవర్గ స్థాయి సమీక్షలో భగ్గుమన్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కోరం కనకయ్యకు టికెట్ ఇవ్వొదని పలువురు కోరారు. అంతే కాకుండా పార్టీ పరిశీలకుని హిందీ ప్రసంగాన్ని అనువాదం చేసే ప్రయత్నంలో జరిగిన తప్పిదం సమావేశంలో గందరగోళానికి కారణమైంది. పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ముఖ్య నాయకులు, పార్టీ బాధ్యులు తమ ప్రసంగాల్లో అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇల్లెందు నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట అని, రెండు పర్యాయాలు గెలిచామని, మూడోసారి కూడా గెలుపే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని కోరారు. పలువురు మండలాధ్యక్షులు మాట్లాడుతూ.. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని, బూత్ స్థాయి కమిటీలు వేసేందుకు పార్టీ పెద్దలు చొరవ తీసుకోవాలని కోరారు. ఆశావహులు డాక్టర్ రవినాయక్, నాగమణి మాట్లాడుతూ.. ఇప్పటికే రెండు దఫాలుగా గెలిపించిన నేతలు పార్టీలు మారారని, ఈ దఫా పార్టీలు మారే వారికి కాకుండా పార్టీని నమ్ముకొని పనిచేసే వారికే టికెట్ ఇవ్వాలని కోరారు.

వివాదం నెలకొంది ఇలా..

పార్టీ పరిశీలకుడు పరమేశ్‌నాయక్ ప్రసంగాన్ని హిందీలో ప్రారంభించాడు. వేదికపై ఉన్న ఏ–బ్లాక్ అధ్యక్షుడు జలీల్ ఆయన ప్రసంగాన్ని అనువదిస్తూ.. 2014, 2018లలో గెలిచిన వారు పార్టీని మోసం చేశారని అనడంతో అక్కడే ఉన్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ ప్రసంగాన్ని తెలుగులో తప్పుగా అనువదిస్తున్నారని పరిశీలకుని దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జలీల్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్న క్రమంలోనే ఇటు టికెట్ ఆశిస్తున్నవారు.. మరోవైపు కోరం కనకయ్య వర్గీయులు వేదిక వద్దకు దూసుకొచ్చి మాటల యుద్ధం ప్రారంభించారు. సమావేశం గాడితప్పిందని గుర్తించిన పరిశీలకుడు కోరం కనకయ్యపై అసహనం వ్యక్తం చేయడంతో ఆయన సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఏం జరుగుతుందో చూద్దామని కోరం కనకయ్య సతీమణి లక్ష్మితోపాటు కొంతమంది కార్యకర్తలు సమావేశంలోనే ఉండిపోయారు.

ఆశావహుల జాతకాలు మా వద్ద ఉన్నాయి

టికెట్ ఆశిస్తున్న 32 మంది ఆశావహుల జాతకాలు మా వద్ద ఉన్నాయి. క్రమశిక్షణరాహిత్యాన్ని క్షమించబోం. ఎవరికి టికెట్ కేటాయించినా గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. సర్వేల ఆధారంగా గెలుపొందే అవకాశం ఉన్న వారికే టికెట్ ఇస్తారు. అగ్ర నాయకులు ప్రకటించిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

–పరమేశ్‌నాయక్, కాంగ్రెస్ పరిశీలకులు

పార్టీ విజయమే లక్ష్యం కావాలి

అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి. సమీక్ష సమావేశంలో చోటుచేసుకున్న పరిణామాలు బాధించాయి. కోరం కనకయ్య వెళ్లిపోవడం సరికాదు. ఆయనకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం కూడా నిర్వాహకుల తప్పిదం. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు.

–పొదెం వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని ఆశ్వారావుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో రేడియోగ్రాఫర్ పోస్టుకు పొరుగుసేవల ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఐడీఓసీలోని జిల్లా ప్రధాన ఆస్పత్రుల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు.

- **అతిథి అధ్యాపకుల నియామకానికి..**

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్ట్ గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.రోజా తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో తెలుగు – 2, ఫిజిక్స్ – 1, వృక్షశాస్త్రం – 1, అర్థికశాస్త్రం – 1, పొలిటికల్ సైన్స్ – 1, కంప్యూటర్ సైన్స్ – 1, జంతుశాస్త్రం – 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీజీ, పీహెచ్‌డీ అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 27వ తేదీ నుంచి 29వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు పూర్తి వివరాలతో స్థానిక కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే డెమో క్లాస్‌కు హాజరు కావాల్సి ఉంటుందని, పూర్తి వివరాల కోసం 70367 34942 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సింగరేణిలో 16 మందికి ఉద్యోగోన్నతి


పదోన్నతి పత్రాలు అందుకున్న అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఇటీవల నిర్వహించిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఈ అండ్ ఎం) గ్రేడ్ – 2 పరీక్షలో అర్హత సాధించిన 16 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. మంగళవారం వారికి సింగరేణి కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ జీఎం వెంకటేశ్వరరావు ఉత్తర్వులు అందజేశారు. ఆగస్టు 6న జరిగిన రాతపరీక్ష జరగగా ఫలితాలు అదేరోజు రాత్రి విడుదల చేశారు. 573 మందిలో 441 మంది అర్హత సాధించారు. అయితే, పరీక్ష రాసిన కొందరు మహిళా అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా, 24 పోస్టుల్లో ఎనిమిదింటిని పక్కన పెట్టి మిగతావి భర్తీ చేయాలని కోర్టు సూచించింది. దీంతో అర్హత సాధించిన వారి నుంచి ఎంపిక చేసిన 16 మందికి కొత్తగూడెంలో నియామకపత్రాలు అందజేశారు. వారికి రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చాక పోస్టింగ్ ఇస్తారు. అనంతరం మొదటి ర్యాంకు సాధించిన సుంకనపెల్లి రమేశ్ మాట్లాడుతూ పరీక్ష నిర్వహించిన రోజే ఫలితాలు విడుదల చేయడం సింగరేణికే సాధ్యమైందని తెలిపారు. ప్రస్తుతం తాను బెల్లంపల్లి ఏరియాలోని ఖైరీగుడ ఓసీలో క్లర్క్‌గా పనిచేస్తున్నానని, ఇప్పుడు పదోన్నతి లభించడం సంతోషంగా ఉందని చెప్పారు. మరో ర్యాంకర్ చింతల సంజయ్ మాట్లాడుతూ రామగుండం – 3 ఏరియాలో మెకానికల్ ఫోర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న తాను పదోన్నతి పొందడంగా ఆనందంగా ఉందని తెలిపారు.

స్టూడెంట్ యూనియన్ నేతలమంటూ హల్‌చల్

- పోలీసులకు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ఫిర్యాదు


ఆశ్రమ పాఠశాలలో నాయకులు

ఇల్లెందు: ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ నాయకులమని చెప్పి కొందరు హల్‌చల్ చేశారు. కారులో స్థానిక ఆశ్రమ బాలికల పాఠశాలకు వచ్చిన వారు హంగామా చేశారు. హెచ్‌ఎం కథనం ప్రకారం.. మంగళవారం ఇల్లెందులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోకి ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ జేఏసీ నేతలమంటూ బానోతు నవీన్, భూక్యా హుస్సేన్‌నాయక్, భాస్కర్, మహేందర్, భూక్యా నవీన్, శ్రీకాంత్ వచ్చారు. అక్కడి వంట గదిలోకి చొరబడి కూరలు బాగాలేవని, చారు అధ్వానంగా ఉందని పారబోసి హల్‌చల్ చేశారు. వంట మనుషులు, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి స్థితిని గమనించిన హెచ్‌ఎం పద్మావతి ఐటీడీఏ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

విద్యార్థి సంఘాల నేతలు క్షమాపణ కోరారు: సీఐ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల (ఓల్డ్)లోకి ప్రవేశించి హల్‌చల్ చేసిన ఘటనలో హెచ్‌ఎం పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యార్థి సంఘాల నేతలను పిలిచి మందలించామని సీఐ కరుణాకర్ తెలిపారు. అయితే, విద్యార్థి సంఘాల నేతలు తమ సమక్షంలో హెచ్‌ఎంకు క్షమాపణ చెప్పారని, హెచ్‌ఎం కేసు విత్‌డ్రా చేసుకున్నారని తెలిపారు.

కాలినడకన వెళ్లి వైద్యసేవలు


పెద్దమిద్దె గ్రామానికి కాలినడకన వెళ్తున్న వైద్య బృందం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలో మారుమూల, దట్టమైన అటవీ ప్రాంతంలోని పెద్దమిద్దె గొత్తికోయల గ్రామానికి మంగళవారం వైద్యులు, సిబ్బంది కాలినడకన వెళ్లి వైద్య సేవలు అందించారు. మొద్దులమాడ గ్రామం నుంచి 3 కిలోమీటర్ల మేర ద్విచక్రవాహనాలపై వెళ్లి ఆ తర్వాత రోడ్డు మార్గం లేకపోవడంతో రెండు వాగులు దాటి, 4 కిలోమీటర్ల వరకు కాలినడకన అటవీ మార్గం గుండా పెద్దమిద్దె గ్రామానికి వైద్య బృందం చేరుకుంది. అనంతరం గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో 29 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఒకరికి ఆర్‌డీటీ పరీక్షలో మలేరియాగా నిర్ధారణ కావడంతో వైద్యం అందించి, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంటీఎస్ విజయారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మణుగూరు మున్సిపాలిటీకి రూ.20 కోట్లు మంజూరు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీకి (టీయూఎఫ్ఐడీసీ) తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కింద రూ.20కోట్లు మంజూరయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని శివారు ప్రాంతాలైన గాంధీనగర్, రాజుపేట, కోటకట్ట తదితర ప్రాంతాలకు నీటి సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులను ఈ నిధులతో పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

టేకులపల్లి: మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గంగారం పంచాయతీ పరిధిలోని సంపత్‌నగర్‌లో పిడుగుపాటుతో కోరం రవీందర్‌కు చెందిన ఆవు మృతి చెందింది. సదరు రైతుకు రూ.50వేల వరకు నష్టం వాటిల్లింది.

16.8 కేజీల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టి 16.8 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఎక్కాల యశ్వంత్, అజయ్ వాహనంపై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద లభించిన గంజాయితో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరు ఒడిశా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి భూపాలపల్లికి తీసుకువెళ్లి చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నట్లు గుర్తించారు. నిందితులను భద్రాచలం ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐలు ముబాషీర్ అహ్మద్, అనిల్, సిబ్బంది కరీం, బాలు పాల్గొన్నారు.

గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత


వాహనంలో కట్టేసిన గోవులు

భద్రాచలంఅర్బన్: ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల నుంచి గోవులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా ఓ వాహనంలో గోవులను తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనంలో ఎనిమిది గోవులు కట్టేసి ఉండగా, ఎస్‌ఐ మధుప్రసాద్ సాధీనం చేసుకుని పాల్వంచలోని గోసంరక్షణశాలకు తరలించారు. ఇందుకు బాధ్యులైన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

పెంపుడు కోళ్లపై వీధి కుక్కల దాడి

సుజాతనగర్: మండల కేంద్రంలో వీధి కుక్కల దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పాత పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి కుక్కలు ప్రవేశించి 5 కోళ్లను చంపేసి మరో 5 కోళ్లను ఎత్తుకెళ్లిన ఘటన వెలుగు చూసింది. రోజు మాదిరిగానే కోళ్ల యజమానులు వాటిని గంప కింద కమ్మి నిద్రపోయారు. రాత్రి సమయంలో ఇంటి ఆవరణలోకి ప్రవేశించిన కుక్కలు కోళ్లపై దాడి చేసి చంపేశాయి. మంగళవారం ఉదయం కోళ్లను విప్పేందుకు వెళ్లి చూడగా 5 కోళ్లను కుక్కలు కొరికి చంపినట్లుగా గుర్తించారు.

డీజే పెట్టిన నలుగురిపై కేసు

పాల్వంచ: ఎలాంటి అనుమతి లేకుండా డీజే సౌండ్ పెట్టిన నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కేటీపీఎస్ కాలనీలో కొందరు వ్యక్తులు టాటా ఏస్ ట్రాలీ ఆటోలో డీజే సౌండ్ పెట్టుకుని రోడ్డుపై విపరీతమైన శబ్దాలతో ఇతరులను ఇబ్బందిపెట్టేలా వ్యవహరించారు. దీంతో ఎస్‌ఐ బి.రాము డీజే వాహనాన్ని సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేశారు.